సాక్షి
వనపర్తి
శుక్రవారం । 14 । జూన్ । 2024



రక్తదాతలకు సలాం
ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలుస్తున్నారు.
వివరాలు 8లో ▸



సాగునీరు అందిస్తాం..
జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యేలు అన్నారు.
వివరాలు 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 27.9 /24.3
రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం వేళ చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

శంకరసముద్రం నుంచి సాగునీరందించండి



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శంకరసముద్రం రిజర్వాయర్ కుడి కాల్వ ద్వారా సాగునీరు అందించాలని కనిమెట్ట, పాలెం, నిర్వేన్ గ్రామాల రైతులు కోరారు. ఈమేరకు గురువారం దమగ్నాపూర్‌లో ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. శంకరసముద్రం రిజర్వాయర్ పనులను పూర్తి చేయకపోవడంతో కుడి కాల్వకు సాగునీరు అందడం లేదన్నారు. కొన్నేళ్లుగా ప్రజాప్రతినిధుల సహకారంతో కుడి కాల్వకు మోటార్లు బిగించి, పంట పొలాలకు నీటిని అందిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం మోటార్లు రిపేరు కావడంతో నీళ్లు తరలించడం సాధ్యం కావడం లేదని.. మోటార్లకు మరమ్మతు, నిర్వహణ ఖర్చులు భారంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. రిజర్వాయర్ పనులను త్వరగా పూర్తిచేసి, కుడి కాల్వ ద్వారా సాగునీరందించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. సంబంధిత అధికారులతో మాట్లాడి, వానాకాలం పంటలకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో యాదగిరి, రమణ, కన్నా, కోటేశ్వర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, వెంకటయ్య, కృష్ణయ్యగౌడ్, బాలయ్య, బాలరాజు, రామకృష్ణ, అంజనేయులు, గట్టుయాదవ్, గోపాల్, శ్రీను, మొగులన్న, రమేష్, కురుమూర్తి, మాసన్న, వెంకటన్న ఉన్నారు.

కొలతల ప్రకారం పనులు చేపట్టాలి



పెబ్బేరు రూరల్: ఉపాధి హామీ పథకం పనులను కొలతల ప్రకారం చేపట్టాలని ఇన్‌చార్జి డీఆర్డీఓ నాగేంద్ర సూచించారు. పెబ్బేరు మండలం రాంపురం చాపలకుంటలో చేపట్టిన ఉపాధి హామీ పనులను గురువారం పరిశీలించారు. ఉపాధి హామీ పనులను నిర్లక్ష్యం చేయకుండా, సద్వినియోగం చేసుకోవాలని కూలీలకు సూచించారు. ఇన్‌చార్జి డీఆర్డీఓ వెంట ఎంపీడీఓ రవీంద్ర, టీఏ పుష్పలత, లోకేష్, నర్సింహారెడ్డి, గోవర్ధన్ ఉన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష ఫలితాలు విడుదల

- పాషాబ్‌గుట్ట పాఠశాలలో 13 మంది ఎంపిక

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆర్థికంగా చేయూతను ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మెరిట్ మీన్స్ స్కాలర్‌షిప్)కు సంబంధించిన పరీక్ష ఫలితాలను ప్రభుత్వం వెలువరించింది. ఈ మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 257 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. మహబూబ్‌నగర్ 73, గద్వాల్ 41, వనపర్తి 43, నాగర్‌కర్నూల్ 54, నారాయణపేట 46 మంది ఇందులో ఉన్నారు. ఎంపికైన ప్రతి విద్యార్థికి సంవత్సరానికి రూ.8వేలను నాలుగేళ్ల పాటు ప్రభుత్వం అందించనుంది. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా మహబూబ్‌నగర్‌లోని షాషాబ్‌గుట్ట పాఠశాల నుంచి 13 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. మోడల్‌బేసిక్ 9, పోలీస్‌లైన్ ఆరుగురు విద్యార్థులు ఇందులో ఉన్నారు.

అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఉన్న ఐదు జూనియర్ కళాశాలలు, పాఠశాలల్లో బోధించేందుకు తాత్కాలిక ప్రతిపాదికన అర్హులైన అధ్యాపకుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ వాణిశ్రీ గురువారం ప్రకటనలో తెలిపారు. తెలుగు–2, ఇంగ్లిష్ 4, గణితం 4, బయోసైన్స్ 3, సోషల్ స్టడీస్ 5, బాటనీ, జువాలజీ, సివిక్స్ ఒక్కొక్కటి చొప్పున, కెమిస్ట్రీ 3 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి డెమోను ఈనెల 14న రాంరెడ్డిగూడెం ఎస్సీ గురుకులంలో నిర్వహిస్తామని, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల లోపు అభ్యర్థులు హాజరుకావాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు మెరుగు
వివరాలు 9లో ▸

వ్యవసాయానికి పెద్దపీట

- వార్షిక రుణ ప్రణాళికలో రూ. 3454.95 కోట్లు కేటాయింపు
- రూ. 4361.66 కోట్ల రుణ ప్రణాళికకు కమిటీ ఆమోదం

వనపర్తి: వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ, రూపొందించిన 2024–25 వార్షిక రుణ ప్రణాళికకు కమిటీ ఆమోదం లభించింది. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా వార్షిక రుణ ప్రణాళిక కమిటీ సమావేశానికి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరయ్యారు. లీడ్ బ్యాంకు మేనేజర్ రూపొందించిన జిల్లా వార్షిక రుణ ప్రణాళికను కమిటీ ఆమోదం కోసం కలెక్టర్ తేజస్ పవార్ ప్రవేశపెట్టారు. గతేడాది రూ. 2368.04 కోట్ల వార్షిక రుణ ప్రణాళికకు గాను రూ. 1993.62 కోట్లు అదనంగా కలిపి ప్రస్తుతం రూ. 4361.66 కోట్లకు పెంచినట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగాలపై ఎక్కువ మంది ఆధారపడి జీవిస్తున్న దృష్ట్యా రూ. 3454.95 కోట్లు (79.21 శాతం) వ్యవసాయ రంగానికి కేటాయించారు. అందులో పంట రుణాలకు రూ. 2461.02 కోట్లు, టర్మ్ లోన్ల కోసం రూ. 571.80 కోట్లు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రూ. 96.01 కోట్లు, అనుబంధ కార్యక్రమాల కోసం రూ. 326.12 కోట్లు కేటాయించినట్లు ప్రణాళికలో పేర్కొన్నారు. ఎంఎస్‌ఎంఈ సెక్టార్‌కు రూ. 353.84 కోట్ల రుణాలు, ఇతర ప్రాముఖ్యత కలిగిన సెక్టార్లకు రూ. 152.27 కోట్లు, విద్యా రుణాలు రూ. 22.95 కోట్లు, గృహ నిర్మాణ రంగానికి రూ. 112 కోట్లు కేటాయించారు. ఈ రుణ ప్రణాళికను కమిటీ ఏక గ్రీవంగా ఆమోదించినట్లు కలెక్టర్ తెలిపారు. రైతులకు అవసరమైన రుణాలు అందించి, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయాలని కలెక్టర్ బ్యాకర్లకు సూచించారు. గ్రామ స్థాయిలో ఆర్థిక లావాదేవీలపై రైతులకు అవగాహన కల్పించేందుకు కృషి చేయాలన్నారు. పంట రుణాల మంజూరు కోసం గ్రామస్థాయిలో మేళాలు నిర్వహించాలని తెలిపారు.



జిల్లా వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేస్తున్న కలెక్టర్ తేజస్ పవార్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి పనులకు బ్యాంకర్లు తమవంతు సహకారం అందించాలన్నారు. గత యాసంగిలో సాగునీటి లభ్యత సక్రమంగా లేకపోవడంతో పంటల సాగు తగ్గిందని.. ప్రస్తుత వానాకాలంలో రైతులకు బ్యాంకర్లు పూర్తి సహకారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. రైతు రుణమాఫీకి సంబంధించి ప్రభుత్వం త్వరలోనే కేబినెట్ సమావేశం ఏర్పాటు చేయబోతుందని వెల్లడించారు. ఖిల్లాఘనపురం మండలం మామిడిమాడలో బ్యాంకింగ్ సేవలు నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.
- జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో పాల ఉత్పత్తి పెంచేందుకు రైతులకు సరిపడా రుణాలు అందించాలని అన్నారు. జిల్లా ప్రజలకు కావాల్సిన మేర పాల ఉత్పత్తి లేకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి తెప్పించుకోవాల్సి వస్తోందన్నారు. పాల ఉత్పత్తిని పెంచేందుకుగాను బ్యాంకర్లు రైతులకు రుణాలు ఇచ్చి, ప్రోత్సహించాలని సూచించారు.
- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో ఇళ్లు నిర్మించుకునేందుకు బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలని అన్నారు. జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామని, బ్యాంకర్లు సహకరించాలని కోరారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ అమూల్ పవార్, ఆర్‌బీఐ నుంచి ఎల్‌డీఓ పల్లవి, నాబార్డు ఏజీఎం మనోహర్ రెడ్డి, కేవీకే శాస్త్రవేత్త దాదా సాహెబ్ ఖోగారే, యునియన్ బ్యాంక్ డిప్యూటీ రీజినల్ హెడ్ శ్రీనివాస్ మూర్తి తదితరులు ఉన్నారు.

మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని బైపాస్ రోడ్డు వద్ద ఉన్న ఓ ప్రముఖ రెస్టారెంట్‌లో ఇటీవల ఆహార భద్రత అధికారుల టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలను నిర్వహించింది. రెస్టారెంట్‌లోని ఫ్రిడ్జ్‌లో రోజుల తరబడి నిల్వ ఉంచిన 70 కిలోల చికెన్, మటన్‌ను కస్టమర్లకు సరఫరా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అలాగే లేబుల్ లేని ప్యాకేజ్డ్ ఆహార పదార్థాలు, కాలం చెల్లినవి, కల్తీ పదార్థాలను వాడుతున్నట్లు తనిఖీల్లో బయటపడింది.

వనపర్తి జిల్లాకేంద్రంలోని హోటల్లు, బేకరీలను గత వారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నీలిమ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. పలు హోటళ్లకు రూ.29 వేల వరకు జరిమానా విధించారు. శుభ్రత పాటించని హోటళ్లకు నోటీసులు జారీ చేశారు. ఎక్కువ రోజులు నిల్వ ఉంచిన ఆహార పదార్థాల నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించారు.

కొనితెచ్చుకుంటున్న.. రోగాలు

హోటళ్లు, రెస్టారెంట్లలో కల్తీమయమైన ఆహార పదార్థాలు



వనపర్తిలోని ఓ బేకరిలోని ఫ్రిజ్‌లో నిల్వ ఉన్న పదార్థాలను పరిశీలిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నీలిమ (ఫైల్)

ప్రస్తుత పోటీ ప్రపంచంలో చాలా మంది ఉరుకులు, పరుగుల జీవితమే గడుపుతున్నారు. ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతరత్రా పనుల దృష్ట్యా ప్రతిరోజు వివిధ ప్రాంతాలకు ప్రయాణాలు చేస్తుంటారు. ఈ క్రమంలో ఆకలి బాధ తీర్చుకోవడానికి హోటళ్లను ఆశ్రయిస్తున్నారు.. వీరి అవసరాన్ని ఆసరాగా చేసుకొని కొందరు నిర్వాహకులు నిల్వ మాంసం, కుళ్లిన కూరగాయలతో.. మసాలాలు దట్టించి.. ఘుమఘుమలాడే వంటకాలతో ఆకర్షిస్తున్నారు.. ఇవేమి గుర్తించని ప్రజలు ఎక్కడ పడితే అక్కడ.. ఏది దొరికితే అది తింటూ రోగాలను 'కొని'తెచ్చుకుంటున్నారు.. ఇందుకు పెద్ద పెద్ద భవంతుల్లో ఉండే హోటళ్లు, రెస్టారెంట్లు మొదలుకొని.. రోడ్లపై ఉండే తోపుడు బండ్ల వరకు కారణమవుతున్నాయి.



- చాలా వరకు నిల్వ మాంసం, కుళ్లిన కూరగాయలే వినియోగం
- ఫాస్ట్‌ఫుడ్, పానీపూరి బండ్ల వద్ద అదే పరిస్థితి
- అధికారుల తనిఖీలతో వెలుగులోకి భయానక దృశ్యాలు
- నిర్వాహకుల నిర్లక్ష్యానికి బలవుతున్న ప్రజలు

సాక్షి, నాగర్‌కర్నూల్: కాలంతో పరుగులు తీస్తూ బిజిబిజిగా గడుపుతున్న ఉద్యోగ, వ్యాపార వర్గాలు ఎక్కువగా హోటళ్లు, రెస్టారెంట్లపై ఆధారపడుతున్నారు. అయితే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలు హోటళ్లు, రెస్టారెంట్లు విచ్చలవిడిగా ఆహారాన్ని కల్తీ చేస్తూ ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నాయి. కొన్ని రెస్టారెంట్ల నిర్వాహకులు రోజుల తరబడి కుళ్లిన మాంసాన్ని ఫ్రిడ్జ్‌లో నిల్వచేసి, అదే మాంసాన్ని వేడివేడిగా వినియోగదారులకు వడ్డిస్తున్నారు. లేబుల్ లేని ఆహార పదార్థాలు, తినుబండారాలు, ప్యాకేజ్డ్ ఫుడ్, నాసిరకం, కల్తీ నూనెలతో అడ్డగోలుగా దందా కొనసాగిస్తున్నారు. విచ్చలవిడిగా ఆహార కల్తీలకు పాల్పడుతూ, ప్రజారోగ్యం పాలిట శాపంగా పరిణమిస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లపై కొద్దిరోజులుగా ఫుడ్ సేఫ్టీ అధికారుల రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు చేపడుతోంది. అధికారుల తనిఖీల్లో ఆహార భద్రత విషయంలో విస్మయం గొలిపే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.

నూనె నుంచి మసాలాల వరకు విచ్చలవిడిగా కల్తీ..

ఉమ్మడి జిల్లాలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లలో కల్తీ ఆహార పదార్థాల వినియోగం ఎక్కువైంది. చాలా చోట్ల కనీస పరిశుభ్రత కన్పించడం లేదు. పలు హోటళ్లు వంటనూనెల విషయంలో ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నాయి. నాసిరకం, కల్తీ నూనెలతో రోజుల తరబడి వినియోగిస్తూ ప్రజారోగ్యాన్ని కబలిస్తున్నాయి. పానీపూరి, ఫాస్ట్‌ఫుడ్ హోటళ్లలో ప్రమాదకరమైన రసాయనాలను వినియోగిస్తున్నారు. అపరిశుభ్ర వాతావరణంలో కల్తీ పదార్థాలు, నీటితో ఆహారం వడ్డిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. రోజుల తరబడి చికెన్, మటన్‌ను ఫ్రిడ్జ్‌లో నిల్వ ఉంచి, మసాలాలు, రకరకాల ఫ్లేవర్లతో వేడివేడిగా కస్టమర్లకు అందిస్తున్నారు. పాలు, టీ పొడి, కారం, పసుపు, మసాలా, మాసం, నూనె, ప్యాకేజ్డ్ ఫుడ్, నీరు ప్రతి దాన్ని కల్తీ చేయడం అధికారుల తనిఖీల్లో బయటపడుతోంది. ఇంకా అధికారుల కంటికి చిక్కకుండా వందల సంఖ్యలో హోటళ్లు తమ దందాను కొనసాగిస్తున్నాయి. ఆహార కల్తీలతో పెద్ద ఎత్తున ప్రజలు వ్యాధుల బారిన పడుతూ ఆసుపత్రుల్లో చేరుతున్నారని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. ఆహారం కల్తీ అయితే మొదట చిన్నారుల్లో తీవ్ర ప్రభావం చూపుతుందని, కలుషిత, కల్తీ ఆహారంతో అతిసారం నుంచి కేన్సర్ దాకా రోగాలకు గురవుతున్నారని చెబుతున్నారు.

సిబ్బంది లేక మొక్కుబడిగా తనిఖీలు..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా హోటళ్లు, రెస్టారెంట్లలో నాణ్యమైన ఆహారాన్ని అందించడం, పరిశుభ్రంగా నిర్వహించడంలో ఫుడ్ సేఫ్టీ అధికారులది కీలకపాత్ర. ఆహార భద్రత విభాగం అధికారుల పర్యవేక్షణ, నిరంతర తనిఖీలతో ఆహార కల్తీ నియంత్రణకు అవకాశం ఉంటుంది. అయితే ఈ శాఖలో జిల్లా అధికారితో పాటు ఒక్కరు, ఇద్దరు మాత్రమే సిబ్బంది ఉండటం, ఒక్కో జిల్లా అధికారితో రెండు, మూడు జిల్లాల ఇన్‌చార్జి బాధ్యతలు ఉండటంతో పర్యవేక్షణ కొరవడుతోంది. అవసరమైన సిబ్బంది లేక అన్నిచోట్ల తనిఖీలు చేపట్టలేకపోతున్నారు. ఒకవేళ తనిఖీలు చేసి శాంపిళ్లను సేకరించినా వాటి రిపోర్టు వచ్చేందుకు మరో 15 రోజుల వరకు సమయం పడుతోంది. ఈలోగా కేసు పరిస్థితి తారుమారు అవుతోంది. కనీసం లైసెన్స్ లేకుండా వందలాది సంఖ్యలో హోటళ్లు నిర్వహిస్తున్నా అధికారులు నోటీసులకే పరిమితం అవుతున్నారు. ఆహార పదార్థాల నాణ్యత నిర్ధారించేందుకు పరీక్షకేంద్రాలను పెంచాలని, ఆహార తనిఖీలను విస్తృతంగా చేపట్టి, నిరంతరం కొనసాగించాలని వినియోగదారులు కోరుతున్నారు.

నిరంతర ప్రక్రియగా తనిఖీలు చేపట్టాలి..



హోటళ్లు, రెస్టారెంట్లలో ఇష్టారీతిగా పాడైన పదార్థాలు, మాంసం, కల్తీ నూనెలను వినియోగిస్తున్నారు. వాటిపై నియంత్రణ, పర్యవేక్షణ ఉండటం లేదు. కుళ్లిన మాంసం, కల్తీ పదార్థాలతోనే వండి వడ్డిస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు నిరంతరం చేపట్టాలి. కల్తీకి పాల్పడ్డ వారికి పెద్ద ఎత్తున జరిమానా, శిక్ష విధించేలా చూడాలి.

– సాయిప్రసాద్, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ జిల్లా

విస్తృతంగా ఆహార తనిఖీలు..

మా పరిధిలోని హోటళ్లు, రెస్టారెంట్లలో నిరంతరం ఆహార తనిఖీలు చేపడుతున్నాం. పలు హోటళ్లలో రోజుల తరబడి మాసం నిల్వలు, లేబుల్ లేని పదార్థాలు, కల్తీ నూనె వినియోగిస్తున్నట్టు గుర్తించాం. శాంపిళ్లను సేకరించి ల్యాబొరేటరీకి పంపుతున్నాం. ఫలితాల ఆధారంగా కేసులు నమోదుచేస్తున్నాం. తనిఖీలను నిరంతరం చేపడతాం, బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

– మనోజ్‌కుమార్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

అమరచింత: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయశాఖ అధికారి డి.చంద్రశేఖర్ అన్నారు. గురువారం అమరచింత పట్టణం, ఈర్లదిన్నె, చింతరెడ్డిపల్లె గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా విత్తనాలు, ఎరువుల స్టాక్‌తో పాటు రికార్డులను పరిశీలించారు. అనంతరం డీఏఓ మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయాలను ఈపీఓఎస్ మిషన్ల ద్వారానే నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో రైతులకు నకిలీ విత్తనాలను అంటగట్టేందుకు దళారులు ప్రత్యేక స్థావరాలను ఏర్పాటు చేసుకున్నారన్న సమాచారం మేరకు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. లైసెన్స్‌గల ఫర్టిలైజర్ దుకాణాల్లోనే నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. కొన్న ప్రతి విత్తనం, ఎరువులకు సంబంధించి రసీదులు విధిగా తీసుకోవాలన్నారు. వరిలో సన్నరకాలైన ఎస్‌ఐడీడీఐ డబ్ల్యూజీఎల్ 44, బీపీటీ 5204, జేజీఎల్ 27356 విత్తనాలను ఈనెల 20వ తేదీలోగా నాటుకోవాలని తెలిపారు. అదేవిధంగా స్వల్పకాలిక సన్నరకాలను జూలై చివరి వారంలో నాటుకోవాలని సూచించారు. డీఏఓ వెంట ఏఓ వినయ్, ఏఈఓ రాజేష్ ఉన్నారు.



ఈర్లదిన్నెలోని ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఏఓ చంద్రశేఖర్

ఓపెన్ ఇంటర్, ఎస్సెస్సీ ఫలితాలు విడుదల



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గత ఏప్రిల్, మే నెలల్లో నిర్వహించిన ఓపెన్ ఇంటర్, ఎస్సెస్సీ పరీక్ష ఫలితాలను ప్రభుత్వం గురువారం విడుదల చేసింది. ఈ మేరకు వెలువడిన ఫలితాలను [illegible] జిలో చూసుకోవాలని సూచించారు. అయితే ఇంటర్మీడియట్ ఫలితాల్లో మహబూబ్‌నగర్ జిల్లాలో 938 మంది పరీక్ష రాయగా.. 571 మంది పాసవగా.. నారాయణపేట జిల్లాలో 995 మంది పరీక్ష రాయగా.. 434 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. అలాగే పదో తరగతి ఫలితాల్లో అత్యధికంగా వనపర్తి జిల్లాలో 341 మంది పరీక్ష రాయగా.. 285 మంది పాసయ్యారు. అత్యల్పంగా మహబూబ్‌నగర్ జిల్లాలో 590 మంది పరీక్ష రాయగా.. 281 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. ఎస్సెస్సీ రీకౌంటింగ్ రూ.350, రీ వెరిఫికేషన్‌కు రూ.1,200, ఇంటర్మీడియట్ రీకౌంటింగ్‌కు రూ.400, రీ వెరిఫికేషన్‌కు రూ.1,200 ఒక్కో సబ్జెక్టు చొప్పున చెల్లించాలని మహబూబ్‌నగర్ డీఈఓ రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత ఫీజులను ఈ నెల 18 నుంచి 27లోగా ఆన్‌లైన్‌లో చెల్లించాలని సూచించారు.

ఇంటర్మీడియట్ ఫలితాలు ఇలా..

జిల్లా	హాజరైన వారు	పాసైన వారు	ఉత్తీర్ణత శాతం
నారాయణపేట	995	434	43.62
మహబూబ్‌నగర్	938	571	60.87
నాగర్‌కర్నూల్	650	365	56.15
గద్వాల	814	407	50
వనపర్తి	448	256	57.14

ఎస్సెస్సీ ఫలితాలు ఇలా..

జిల్లా	హాజరైన వారు	పాసైన వారు	ఉత్తీర్ణత శాతం
నారాయణపేట	593	331	55.82
మహబూబ్‌నగర్	590	281	47.63
గద్వాల	557	266	47.76
నాగర్‌కర్నూల్	499	276	55.31
వనపర్తి	341	285	83.58

ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

పెబ్బేరు రూరల్: ఆశావర్కర్లకు అర్హత పరీక్ష నిర్వహించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆశావర్కర్స్ యూనియన్, సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు, కార్యదర్శి పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో 33 ఏళ్లుగా, మైదాన ప్రాంతాల్లో 19 ఏళ్లుగా ఆశావర్కర్లు పనిచేస్తున్నారని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ప్రజలకు వైద్యసేవలు అందించడం.. వైద్యారోగ్య శాఖ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని చెప్పారు. ఆశావర్కర్లకు మళ్లీ కొత్తగా పరీక్ష నిర్వహించి, వారి జ్ఞాపక శక్తిని నిరూపించుకోవాలని చెప్పడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బొబ్బిలి నిక్సన్, ఆర్యన్ రమేష్, రాము, ఎస్.రాములు, బుచ్చమ్మ, భాగ్యమ్మ, లక్ష్మీదేవి, శ్యామల, అనిత, ఇందిర, అనసూయ, కల్పన, జ్యోతి, అరుణ, రాధ ఉన్నారు.



మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

అమరచింత: మున్సిపల్ అభివృద్ధికి ఆయా వార్డు కౌన్సిలర్లతో కలిసి ప్రత్యేక దృష్టి సారించామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ తెలిపారు. మున్సిపల్ సమావేశ మందిరంలో గురువారం చైర్‌పర్సన్ అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో పలు అంశాలపై తీర్మానాలు చేశారు. ఈసందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ మొత్తం 24 అంశాలతో సమావేశం నిర్వహించామన్నారు. వీటిలో ఒక అంశం తీర్మానం చేయదన్నారు. కౌన్సిల్ సభ్యులు, సిబ్బంది వేతనాలు, వారికి సేఫ్టీ పరికరాల కొనుగోలు చేయుటకు, నలుగురు సిబ్బందిని రీప్లేస్మెంట్ చేసేందుకు ఆమోదం తెలిపామన్నారు. అదేవిధంగా కార్యాలయ నిర్వహణకు ఖర్చు, పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాలు, తాగునీటి సరఫరా, హరితహారం, విద్యుత్ చార్జీలు మొదలగు అంశాలపై చర్చించినట్లు పేర్కొన్నారు.

సంఘటితంగా ముందుకు..

ప్రజలు తమకు ఇచ్చిన అవకాశం సద్వినియోగం చేసుకుంటూ వార్డుల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించే విధంగా కౌన్సిల్ సభ్యులు కలిసి రావాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసుకొనేందుకు ఇప్పటికే ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి విన్నవించామని తెలిపారు. పట్టణంలో పారిశుద్ధ్య పనులపై దృష్టి సారిస్తున్నామని, అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తీసుకొనేందుకు సిద్ధంగా ఉన్నామని మున్సిపల్ కమిషనర్ నురుల్ నదీం అన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జీఎస్ గోపి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మంగమ్మ



క్లుప్తంగా

వస్త్ర దుకాణంలో యువకుడి ఆత్మహత్య


అశోక్ రెడ్డి (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: ఆర్థిక సమస్యలతో సొంత దుకాణంలో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన సమాచారం మేరకు.. బొందలపల్లికి చెందిన అశోక్‌రెడ్డి (25) నాలుగు నెలల క్రితం జిల్లా కేంద్రంలోని నాగనూలు రోడ్డులో వస్త్ర దుకాణాన్ని నిర్వహిస్తు జీవనం సాగిస్తున్నాడు. ఈయనకు ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురై తన దుకాణంలోనే ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. గురువారం ఉదయం గమనించిన స్నేహితులు పోలీసులు, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చోరీ కేసులో నలుగురికి జైలుశిక్ష

కల్వకుర్తి: పట్టణంలో వరుస దొంగతనాలకు పాల్పడిన వ్యక్తులకు కోర్టు జైలు శిక్ష విధించిందని ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. పట్టణంలోని బాల్‌రాంనగర్ కాలనీకి చెందిన కొండపల్లి ఆంజనేయులు, కొండపల్లి స్వామి, శంకర్, కొండపల్లి శివప్రసాద్ వరుస దొంగతనాలు చేశారని చెప్పారు. వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో హరిహర టౌన్‌షిప్‌లో ఇద్దరు చోరీ చేశారన్నారు. కల్వకుర్తి ఫస్ట్‌క్లాస్ కోర్టు న్యాయమూర్తి కావ్య గురువారం ఒక్కొక్కరికి నాలుగు నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని వెల్లడించారు.

జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. గురువారం ప్రాజెక్టుకు 6,673 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఎగువ నుంచి స్వల్పంగా ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్న విషయం తెలిసిందే. ప్రాజెక్టులో 6.768 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. 123 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

కోయిల్‌సాగర్‌లో 10.6 అడుగుల నీటిమట్టం

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం గురువారం సాయంత్రం వరకు 10.6 అడుగులకు చేరింది. యాసంగి సీజన్ కింద పంటలకు నీటి విడుదల తర్వాత 16 అడుగుల మేర ఉన్న నీటిమట్టం తాగునీటి అవసరాలకు వాడుకోవడంతో తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం ఎత్తిపోతల పథకంలో భాగంగా జూరాల దిగువ భాగంలోని ఉంద్యాల పంపుహౌజ్ ఫేజ్–1 నుంచి గురువారం ఒక పంపును రన్ చేసి నీటి విడుదలను ప్రారంభించారు. ఎత్తిపోతల నీరు కోయిల్‌సాగర్‌కు చేరితే నీటిమట్టం పెరిగే అవకాశం ఉంది.

చిరుత దాడిలో యువకుడికి గాయం

నవాబుపేట: గ్రామంలో బహిర్భూమికి వెళ్లిన యువకుడిపై చిరుత దాడికి యత్నించగా, తృటి తప్పించుకున్న ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కొత్తపల్లి సమీపంలో గురువారం రాత్రి భోజనం అనంతరం పెంటల శేఖర్ గ్రామానికి సమీపంలో బహిర్భూమికి వెళ్లాడు. అక్కడే మాటు వేసిన చిరుత అతనిపై దూకింది. దీంతో చేతులు అడ్డుపెడుతూ కేకలు వేయడంతో చేతికి గాయం చేసి అడవిలోకి వెళ్లిందని బాధితుడు తెలిపాడు. గ్రామస్తులు అతన్ని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించి జిల్లా ఆస్పత్రికి తరలించారు. చేతికి గాయమై రక్తస్రావమైంది. కాగా ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. దీంతో గ్రామం మొత్తం చిరుత భయంతో జాగారం చేస్తున్నారు. ఈ విషయంలో అటవీశాఖ అధికారులు చిరుతను బంధించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రక్తదాతలకు సలాం



- ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఐదు బ్లడ్ బ్యాంకులు
- పాలమూరు పట్టణంలో మూడు ప్రైవేట్ రక్తనిధి కేంద్రాలు

నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

పాలమూరు: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రెడ్‌క్రాస్‌తో పాటు ఐదు ప్రభుత్వ బ్లడ్ బ్యాంకులు, పాలమూరు పట్టణంలో మూడు ప్రైవేట్ బ్లడ్‌బ్యాంకులు పని చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతి రోజు వంద నుంచి 150మందికి రక్తం అవసరం పడుతుంది. ప్రధానంగా ఇటీవల ఉమ్మడి జిల్లాలో రోడ్డు ప్రమాద కేసులు పెరిగాయి. వీరితో పాటు ప్రసవం, రక్తహీనత కేసులకు సైతం దాతల నుంచి తీసిన రక్తం అవసరం పడుతుంది. జనరల్ ఆస్పత్రి, రెడ్‌క్రాస్‌లో రక్తనిధి కేంద్రాల్లో నిల్వలు తగ్గుముఖం పట్టకుండా చర్యలు తీసుకుంటున్నారు. జనరల్ ఆస్పత్రిలో 500 యూనిట్ల వరకు రక్తాన్ని నిల్వ ఉంచే సామర్థ్యం ఉంది. కానీ ప్రతి నెల 250నుంచి 350యూనిట్లు అవసరం ఉండటం వల్ల అదేస్థాయిలో సేకరిస్తున్నారు. జనరల్ ఆస్పత్రిలో గతేడాది కాలంలో 30 క్యాంపులు నిర్వహించి 3,500 యూనిట్ల రక్తం సేకరించి 3,881 రోగులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకున్నారు. 2024లో ఇప్పటి వరకు 11క్యాంపుల ద్వారా 1,200 యూనిట్ల రక్తం సేకరించారు. దీనిని 970 మంది రోగులకు ఉపయోగపడింది. రెడ్‌క్రాస్ ద్వారా 2023–24లో 162 క్యాంపులు నిర్వహించి 6,289 యూనిట్ల రక్తం సేకరించారు. బ్లడ్ బ్యాంక్‌లలో పరిమితికి తగ్గి నిల్వలు ఉంటే అత్యవసర సమయాల్లో దాతల నుంచి రక్తాన్ని సేకరించే పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయి. అది కూడా అవసరమున్న వ్యక్తులు దాతలను తీసుకొస్తేనే సమస్యకు పరిష్కారం లభిస్తోంది.


అరుదైన గ్రూపులు

రక్తంలో ఏ, బీ, ఏబీ, ఓ పాజిటివ్, నెగెటివ్ గ్రూపులు ఉంటాయి. వీటిలో పాజిటివ్ గ్రూపులు ఎక్కువగా ఉంటాయి. నెగెటివ్ గ్రూపులు చాలా అరుదుగా ఉంటాయి. ఏబీ నెగెటివ్ వేల మందిలో ఒకరు, ఇద్దరు మాత్రమే ఉంటారు. ప్రైవేట్ బ్లడ్ బ్యాంకులలో రక్తం తీసుకునే ముందు హెచ్‌బీ శాతం, హెచ్‌ఐవీ పరీక్షలు రిపోర్టు, క్రాస్‌మ్యాచింగ్ రిపోర్టు ఉందో లేదో సరిచూసుకోవాలి.

తెలుసుకోవాల్సిన అంశాలు

ఆరోగ్యవంతులైన వారు మూడు నెలలకోసారి రక్తదానం చేయడానికి అవకాశం ఉంది. ఒక వ్యక్తి శరీరంలో దాదాపు పది యూనిట్ల రక్తం ఉంటుంది. రక్తదానం సందర్భంగా ఒక యూనిట్ దానం చేస్తారు. రక్తంలోని ఎర్ర రక్తకణాలనే అయితే రెండు నెలలకోమారు దానం చేయవచ్చు.

- ఆరోగ్యవంతులైన 18–60ఏళ్ల మధ్య వయసు కలిగిన వారు రక్తదానం చేయడానికి అవకాశం ఉంది.
- రక్తదానం చేసే ప్రతి ఒక్కరు 45 కేజీల బరువు ఉండాలి. అంతకంటే తక్కువ బరువు కలిగిన వారు రక్తదానం చేయకపోవడం మంచిది.
- శరీర ఉష్ణోగ్రత, బీపీ పల్స్‌రేట్ వంటివి సాధారణ స్థాయిలో ఉండాలి.
- రక్తంలో హిమోగ్లోబిన్ కనీసం 12.5 గ్రాములకు తక్కువ కాకుండా ఉండాలి.


జనరల్ ఆస్పత్రిలో బ్లడ్ బ్యాంకులో నిల్వ ఉన్న రక్త యూనిట్లు

రక్తదానం చేయడానికి వీరు అనర్హులు

మామూలుగా రక్తదానం శ్వాసకోశ వ్యాధులున్న వారు, క్యాన్సర్, గుండె జబ్బులు, బరువు తగ్గడం, డయాబెటిక్, హెపటైటిస్, ఆస్తమా, ఎపిలెప్సీ, కాలేయవ్యాధులు, ఎండోక్రైన్ సమస్యలు, ఎయిడ్స్ లక్షణాలు కలిగిన వారు, ఇతర దీర్ఘకాలిక వ్యాధుల ఉన్న వారు రక్తదానం చేయరాదు.

- మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులకు చికిత్స పొందిన వారు శస్త్రచికిత్సలు చేయించుకున్నవారు. రక్తదానం పొందిన వారు కనీసం ఏడాది వరకు రక్తదానం చేయడానికి వీలులేదు.
- దగ్గు, జలుబు జ్వరం వంటి అస్వస్థత కల్గిన వారు, ఏదైనా చికిత్సలో భాగంగా మందులు వాడుతున్నవారు ఆ విషయాల్ని వైద్యులకు చెబితే వారు ఎప్పటి వరకు రక్తదానం చేయరాదు అనే విషయం చెబుతారు.

మూడు గ్రూపుల అధిక వినియోగం



సాధారణంగా మూడు రకాల బ్లడ్ గ్రూప్‌లను అధికంగా వినియోగించడం జరుగుతుంది. ఏ, బీ, ఓ పాజిటివ్ గ్రూప్‌లను రక్తదాన శిబిరాలలో ఎక్కువగా రక్తదాతలు ఇస్తారు. ఏ–బీ నెగెటివ్ గ్రూప్ చాలా అరుదుగా లభ్యం అవుతాయి. జనరల్ ఆస్పత్రిలో ఉన్న బ్లడ్ బ్యాంకు నుంచి ఉమ్మడి జిల్లాతో పాటు కొడంగల్, తాండూర్, వికరాబాద్ నుంచి రెఫర్ కేసులు వస్తాయి. రక్తం ఎక్కువగా గైనిక్, రోడ్డు ప్రమాదం కేసులకు, తలసేమియా, ఏర్నియా(రక్తహీనత) కేసులకు అవసరం పడుతుంది. – మధుసూదన్‌రెడ్డి, రక్త సేకరణ క్యాంపు ఆర్గనైజర్ జనరల్ ఆస్పత్రి

వ్యక్తి ప్రాణం కాపాడాలి



రక్తదానం చేయడం వల్ల ఓ వ్యక్తి ప్రాణం కాపాడివారం అవుతాం. ఏ పాజిటివ్ బ్లడ్ గ్రూప్ కలిగిన నేను ఇప్పటి వరకు 48సార్లు రక్తదానం చేయడంతో పాటు ఎంతో మందిని ప్రోత్సాహించి రక్తదానం చేయించాను. ఒక్కసారి ప్లాస్మాదానం కూడా చేశాను. పోలీస్ శాఖలో కూడా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం ప్రజల్లో చైతన్యం కోసం ముందు నేను రక్తదానం చేసేవాడిని. –రంగినేని మన్మోహన్, హెడ్‌కానిస్టేబుల్

రాష్ట్రంలో ప్రథమ స్థానంలో



రాష్ట్రంలోనే 157సార్లు రక్తదానం చేయడంతో పాటు 8 సార్లు ప్లాస్మా, 8 సార్లు ప్లేట్‌లెట్స్ దానం చేయడం జరిగింది. నేను మొదటి సారిగా 1983లో రక్తదానం చేయడం మొదలు పెట్టాను. అప్పటి నుంచి ప్రతి మూడు నెలలకు ఓసారి రక్తదానం చేస్తున్నాను. రెడ్‌క్రాస్ నుంచి ఈ ఏడాదిలో 162క్యాంపులు ఏర్పాటు చేసి 6,289 యూనిట్లు సేకరించాం. ప్రస్తుతం రెడ్‌క్రాస్‌లో ఎస్‌డీపీ మిషన్ అందుబాటులోకి తెచ్చాం. ప్లేట్‌లెట్స్ తగ్గిన వారికి రెడ్‌క్రాస్‌లో ఎక్కించడానికి సిబ్బందికి శిక్షణ ఇప్పించాం. – నటరాజ్, రెడ్‌క్రాస్ చైర్మన్

ప్రతి పుట్టినరోజు నాడు రక్తదానం



ప్రతి పుట్టిన రోజు సందర్భంగా స్వచ్ఛందంగా జనరల్ ఆస్పత్రికి వచ్చి రక్తదానం చేయాలని నిర్ణయించుకున్నాను. రెండేళ్లుగా ఆస్పత్రిలో ఇస్తున్నాను. రాబోయో రోజుల్లో కూడా అత్యవసరం అయిన సందర్భాల్లో ఇస్తాను. – పవన్, వెంకటేశ్వర కాలనీ

40సార్లు రక్తదానం చేశా..



కొన్నేళ్ల నుంచి స్వచ్ఛందంగా 40 సార్లు రక్తదానం చేశా. గర్భిణులకు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి రక్తం చాలా అవసరం వస్తోంది. మనం చేసే రక్తదానం ఆపదలో ఉన్న వాళ్లకు ఉపయోగపడితే చాలా సంతోషంగా ఉంటుంది. వృత్తిరీత్యా బజ్జీల వ్యాపారం చేస్తాను. నా బ్లడ్ గ్రూప్ ఓ పాజిటివ్ కావడంతో చాలా మందికి అవసరం ఉంటుంది. నేను రక్తదానం చేయడం 2013లో ప్రారంభం చేశాను. –ఆనంద్‌కుమార్, సుభాష్‌నగర్

చిల్డ్రన్స్ ప్లేజోన్‌పై నీలినీడలు

- మెయిన్ స్టేడియంలో క్రీడాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు
- గత కొన్నేళ్ల నుంచి నిర్లక్ష్యానికి గురైన వైనం
- అభివృద్ధికి నోచుకోక.. విరిగిపోయిన ఆట వస్తువులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో అన్ని రకాల క్రీడాభివృద్ధి పనులు శరవేగంగా జరిగాయి. ఒకపక్క మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, మరోపక్క వాలీబాల్ అకాడమీ ఏర్పాటుతోపాటు స్టేడియంలో ఆధునీకరణ పనులు కూడా పూర్తి చేశారు. అయితే మెయిన్ స్టేడియంలో ఇతర క్రీడాభివృద్ధి పనులు చేసినప్పటికీ చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ప్లేజోన్ (పార్క్) నిర్లక్ష్యానికి గురైందని విమర్శలు ఉన్నాయి. స్టేడియంలో క్రీడాకారుల కోసం వివిధ కోర్టులు, వాకర్ల కోసం వాకింగ్ ట్రాక్, చిన్నారుల కోసం క్రీడాశాఖ కార్యాలయం ఎదుట ప్లేజోన్ ఏర్పాటు చేశారు. అయితే గత కొన్నేళ్ల నుంచి ఈ ప్లేజోన్ అభివృద్ధికి నోచుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ప్లేజోన్‌లోని పెద్ద ఊయలలో కొన్ని విరిగిపోగా.. మరికొన్ని ఆట వస్తువులు విరిగిపోయి మూలకుపడ్డాయి. కొన్నేళ్లుగా ఉన్న అరకొర ఆట వస్తువులతోనే పిల్లలు ఆడుకుంటున్నారు. ప్లేజోన్‌లో చిన్నారుల కోసం సంబంధించిన పూర్తిస్థాయిలో ఆట వస్తువులు ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.


మహబూబ్‌నగర్‌లోని మెయిన్ స్టేడియంలో చిల్డ్రన్స్ ప్లేజోన్


విరిగిపోయి మూలకుపడిన ఆట వస్తువులు

- ఈ విషయమై డీవైఎస్‌ఓ శ్రీనివాస్‌ను 'సాక్షి' సంప్రదించగా చిల్డ్రన్స్ ప్లేజోన్‌లో విరిగిపోయిన ఆట వస్తువులకు మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. చిల్డ్రన్స్ ప్లేజోన్‌ను అభివృద్ధి చేసి త్వరలో మరిన్ని ఆటవస్తువులను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

సాగునీరు అందించడమే లక్ష్యం


నీటిని విడుదల చేసి పూజలు చేస్తున్న ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, జెడ్పీచైర్ పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి

- ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి

చిన్నచింతకుంట: రైతులకు సాగునీరు అందిచడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వ కృషి చేస్తుందని దేవరకద్ర, మక్తల్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డితో కలిసి మండలంలోని ఉంద్యాల గ్రామ ఫేజ్–1 పంపు హౌజ్ నుంచి ఒక పంపు ద్వారా 315 క్యూసెక్కుల జూరాల నీటిని కోయిల్‌సాగర్ ప్రాజెక్టుకు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నారన్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచారన్నారు. అంతేకాక పంటలకు సాగునీరు అందించే దిశగా పనిచేస్తున్నారన్నారు. అందుకు ముఖ్యమంత్రి ఆదేశానుసారంగా జూరాల ప్రాజెక్ట్‌లోకి వరద నీరు చేరగానే ఆ నీటిని కోయిల్‌సాగర్ ప్రాజెక్టుకు విడుదల చేయడం జరిగిందన్నారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్ పూర్తి స్థాయిలో నింపి వాటి నుంచి చెరువులు, కుంటలకు తరలించి నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు నీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ ప్రతాప్‌సింగ్, డిప్యూటీ డీఈ చందు, ఏఈ కిషన్, మహిమూద్, సురేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, వెంకటేష్, శాంతిరెడ్డి, దేవేందర్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

నెట్టెంపాడు ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరు


లిఫ్టు-1 గుడ్డెందొడ్డి వద్ద స్విచ్ ఆన్ చేసి మోటారును ప్రారంభిస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ సరిత

ధరూరు: నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం కింద ఉన్న ప్రతి ఎకరాకు సాగు నీటిని విడుదల చేస్తామని జెడ్పీచైర్‌పర్సన్ సరిత అన్నారు. గురువారం మండలంలోని గుడ్డెందొడ్డి గ్రామ సమీపంలోని నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగమైన లిఫ్టు–1 గుడ్డెందొడ్డి పంప్‌హౌస్ వద్ద మండల నాయకులు, పీజేపీ ఇంజినీర్లతో కలిసి ఆమె ఒక పంపును ప్రారంభించి నీటి విడుదలను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విధాలా ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ముఖ్యంగా గద్వాల, ఆలంపూర్ నియోజకవర్గాల రైతులకు సాగు నీటిని విడుదల చేసేందుకు ముందస్తుగా రిజర్వాయర్లు, చెరువులను నింపేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుత వానాకాలంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా సాగు నీటిని విడుదల చేస్తున్నామన్నారు. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో త్వరలోనే జూరాలకు పెద్ద ఎత్తున వరద నీరు వచ్చే అవకాశాలున్నాయన్నారు. ఈమేరకు జెడ్పీటీసీ పద్మావెంకటేశ్వరరెడ్డి, గద్వాల మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, పీజేపీ ఈఈ రహీముద్దీన్‌తో కలిసి స్విచ్ ఆన్ చేసి ఒక పంపును ప్రారంభించారు. కార్యక్రమంలో గుడ్డెందొడ్డి ఎంపీటీసీ సహదేవులు, నాయకులు వెంకటేశ్వరరెడ్డి, మధుసూదన్‌బాబు, డీఆర్ శ్రీధర్, అల్వాల రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సీసల్ వెంకట్‌రెడ్డి, ధరూరు రవి పాల్గొన్నారు.

కారు అద్దాలు పగలగొట్టి నగదు చోరీ


పగిలిన కారు అద్దాలు

నారాయణపేట రూరల్: పట్ట పగలు, రద్దీ ప్రదేశంలో చాకచక్యంగా కారు అద్దాలు పగలగొట్టి నగదు చోరీ చేసిన ఘటన తీవ్ర కలకలం రేపింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కోస్గి పట్టణానికి చెందిన ఎన్.వెంకటేష్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో హౌసింగ్‌లోన్ తీసుకున్నాడు. గురువారం దాన్ని క్లియర్ చేయాలని నారాయణపేటకు తన కారులో రూ.2.90లక్షల నగదును తీసుకుని వచ్చాడు. ముందుగా హైదరాబాద్ రోడ్డులోని బ్యాంక్‌కు వెళ్లి డీడీ తీయాలని ప్రయత్నించగా తన అకౌంట్ క్లోజ్ అయ్యిందని చెప్పడంతో తిరిగి సొంతూరికి బయలుదేరాడు. మార్గమధ్యలో చౌక్‌బజార్‌లోని ఏపీటీయూఎస్ బ్యాంకు కనిపించడంతో కారును రోడ్డు పక్కలో నిలిపి బ్యాంకులోకి వెళ్లి డీడీ తీసేందుకు అవకాశం ఉందేమోనని మేనేజర్‌ను కలిసి విచారణ చేసి బయటకు వచ్చాడు. అప్పటికే కారు అద్దాలు పగలకొట్టి డబ్బులను చోరీ చేసినట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. సమీప దుకాణాల వద్ద ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. పట్టపగలు, ప్రధాన రహదారిపై జనసంచారం ఉండి వాహనాలతో రద్దీగా ఉన్న చోట ఇంత పెద్ద మొత్తంలో నగదు ఎత్తుకెళ్లడం తీవ్ర కలకలం రేపుతుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒకేరోజు 200 మందికి శస్త్రచికిత్సలు

- అచ్చంపేట ఏరియా ఆస్పత్రిలో మెగా సర్జికల్ క్యాంపు
- ఆపరేషన్లు చేసిన ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ


వైద్యులతో కలిసి శస్త్ర చికిత్స నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో గురువారం మెగా సర్జికల్ క్యాంపు నిర్వహించారు. పలు శస్త్ర చికిత్సల కోసం మొత్తం 1,200 మంది దరఖాస్తు చేసుకోగా.. 200 మందికి మేజర్, మైనర్ ఆపరేషన్లు చేశారు. స్థానిక ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ క్యాంపును పర్యవేక్షించడంతో పాటు ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రభు, ఇతర వైద్యులతో కలిసి శస్త్ర చికిత్సలను విజయవంతంగా పూర్తిచేశారు. మిగతా వారికి విడతల వారీగా శస్త్ర చికిత్సలు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డి సూచనలతో అచ్చంపేట నియోజకవర్గ ప్రజలతో పాటు నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్ ప్రాంతాలకు చెందిన పేదలకు అవసరమైన శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అచ్చంపేట ఆస్పత్రికి ఐసీయూ థియేటర్ మంజూరు చేసినట్లు చెప్పారు. త్వరలోనే అన్ని హంగులతో ప్రారంభిస్తామన్నారు. ఆరోగ్యశ్రీ పథకం 239 రోగాలకు వర్తించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నల్లమల చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా సర్జికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మరో 600 మందికి ఆపరేషన్లు చేయాల్సి ఉందని.. ఈనెల 15న ఉప్పునుంతల, చారకొండ, 19న లింగాల, బల్మూర్ మండలాల వారికి ఆపరేషన్లు చేస్తామని తెలిపారు. అమ్రాబాద్, పదర మండలాల వారికి ఆపరేషన్లు చేసే తేదీలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

సోషల్ మీడియాలో దొంగల ఫొటోలు చక్కర్లు


ముంగిమళ్ల రామస్వామి ఆలయంలో చోరీకి పాల్పడిన దొంగ

కోస్గి: మండలంలోని ముంగిమళ్ల రామస్వామి ఆలయంలో సీసీ కెమెరాలను ధ్వంసంచేసి, హుండీ చోరీకి పాల్పడిన దొంగల ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు ఆలయ ప్రధాన గేట్‌ను ధ్వంసంచేసి, లోపలికి చొరబడ్డారు. ఆలయంలో ఏర్పాటుచేసిన 5 సీసీ కెమెరాలను ధ్వంసం చేసి, హుండీని ఎత్తుకెళ్లారు. ఆలయ సమీపంలోనే హుండీని పగులగొట్టి నగదుతో పరారయ్యారు. కాగా, సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు.. దొంగల ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేయడంతో వైరల్‌గా మారాయి. కాగా, ఇదే ఆలయంలో మూడో సారి దొంగతనం చోటుచేసుకోవడంతో పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు.

అనుమతులు లేని మైనింగ్‌పై చర్యలు


మైనింగ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేట శివారులో గల గుట్ట పక్కన అనుమతులు లేకుండా రైతు పొలంలో మైనింగ్ నిర్వహిస్తున్నారు. విషయం తెలుసుకున్న మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నాగచైతన్య గురువారం పరిశీలించారు. అక్రమంగా తీసిన 15 బ్లాక్లను సీజ్ చేశారు. అక్రమంగా మైనింగ్ నిర్వహిస్తే ఎంతటి వారినైనా కఠినంగా శిక్షిస్తామని తెలియజేశారు. ఆయన వెంట ఆర్‌ఐ సతీష్ కుమార్ ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత


పోలీస్ స్టేషన్‌లో పట్టుబడిన రేషన్ బియ్యం

కేటీదొడ్డి: కర్ణాటకలోని రాయచూర్‌కు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నట్లు గురువారం ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు తెలిపారు. ధరూర్ మండల కేంద్రానికి చెందిన వడ్డె రవి వివిధ గ్రామాల నుంచి 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సేకరించి రాయచూర్‌కు ఆటోలో తరలిస్తుండగా పోలీసులకు సమాచారం రావడంతో మండలంలోని పాతపాలెం శివారులోని రైస్‌మిల్లు వద్ద పట్టుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. వడ్డె రవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జక్లపల్లిలో చేపలు మృతి


చనిపోయిన చేపలు

గండేడ్: మండలంలోని జక్లపల్లి శివారులో గల రాయికుంటలో ప్రతి ఏటా చేపలు పెంచుతారు. వీటిని అదే గ్రామానికి చెందిన తిమ్మాయిపల్లి వెంకటయ్యకు రెండేళ్లకుగాను రూ.2.40లక్షలకు విక్రయించారు. చెరువులో ఉన్న చేపలను వెంకటయ్య అమ్ముకునేవాడు. ఈసారి ఎండలు అధికంగా ఉండడంతో చెరువు అడుగంటుతుండడంతో అనుకూలమైన స్థలంలో గుంత తవ్వుకున్నాడు. ఎండిపోకముందే చెరువులో ఉన్న చేపలను తీసుకెళ్లి గుంతలో వదిలాడు. ఆయన వీలును బట్టి చేపలు మార్కెట్లో విక్రయించేవాడు. గురువారం ఉదయం వెంకటయ్య అక్కడికి వెళ్లి చూడగా చేపలు చనిపోయి నీళ్లలో తేలియాడుతూ కనిపించాయి. మృతి చెందిన చేపల విలువ దాదాపు రూ.3లక్షల వరకు ఉంటుందని వెంకటయ్య తెలిపాడు. విషం ప్రయోగం చేయడం వల్లే మృతి చెందాయని బాధితుడు ఆరోపించాడు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్: డిగ్రీ, PG, B.Tech., Diploma, డి-ఫార్మసీ, బి-ఫార్మసీ, D.Ed, B.Ed, B.P.Ed, MBA, MCA, B.Sc (Agri), B.Sc (నర్సింగ్), GNM అడ్మిషన్లు పరిమితం. ఫోన్: 8886967112,339 [HA-14379]

SERVICES

BUSINESS OFFER

■ లాభదాయకమైన వ్యాపారం కోసం లేడీస్ శానిటరీ ప్యాడ్స్, బేబీ డైపర్ మెషిన్ స్థాపించండి. ప్లాస్టిక్ ఉద్యోగ్‌తో బై బ్యాక్ అగ్రిమెంట్. (Govt. అప్రూవ్డ్) 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-6787]

SECOND SALE

■ Tractor for sale 2022 Model Kubota MU 4501 4WD Tractor (TS-31-K-1583) ఎక్కడ ఎలా ఉన్నది అలానే పద్ధతిపై అమ్మకమునకు కలదు. సుందరమ్ ఫైనాన్స్ లిమిటెడ్. సెల్. 9491444746 [J-1257139]

■ Machinery for sale 2020 Model Kubota Harvest king DC-68G Track Harvester. ఎక్కడ ఎలా ఉన్నది అలానే పద్ధతిపై అమ్మకమునకు కలదు. సుందరమ్ ఫైనాన్స్ లిమిటెడ్. సెల్. 8481444746 [J-1257138]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి, మేనేజర్